

# విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 18-08-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 337 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అమరావతి: వైకాపా రెచ్చగొడుతున్న తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, సమన్వయ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ భేటీలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష వైకాపా ఎన్నికలు వాయిదా వేయించాలని చూస్తోందని అన్నారు. ఓటమి భయంతో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు ఆ పార్టీ యత్నిస్తోందని.. ఇందుకు సంబంధించిన పక్కా సమాచారం తన వద్ద ఉందని వ్యాఖ్యానించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని ముఖ్యమంత్రి సమన్వయ కమిటీ సభ్యులతో అన్నట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని తరువాయి 2లో

## మాతాశిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యం

**రూరల్ జిల్లాలో అత్యాధునిక వసతులతో అందుబాటులోకి 150 పడకల ఆసుపత్రి**



నర్సీపట్నం : మాతాశిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు.

గురువారం నర్సీపట్నం 150 పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు ఎంవిఎస్.మూర్తి, పప్పల చలపతిరావు, మాజీ మాడుగుల ఎమ్మెల్యే తరువాయి 2లో

## 31న నింగిలోకి పీఎస్ఎల్వీ సీ-39

నెల్లూరు : ప్రతినెలా ప్రయోగాలు చేసే దిశగా ఇస్రోలో ఏర్పాట్లు చేస్తున్నట్లు షార్ డైరెక్టర్ కున్హి కృష్ణన్ వెల్లడించారు. ఈ నెల 31న పీఎస్ఎల్వీ సీ-39 అంతరిక్షంలోకి తరువాయి 2లో

## రూ.40 కోట్ల విలువైన కొకైన్ పట్టివేత



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. టాంజానియ, నైజీరియాకు తరువాయి 2లో

## 16 పబ్‌లకు సిట్ నోటీసులు

న్యూఢిల్లీ : డ్రగ్స్ కేసులో ఇప్పటివరకూ సినీ ప్రముఖులను విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పుడు పబ్‌లపై పడింది. హైదరాబాద్‌లో మత్తుమందులకు అడ్డాగా మారిన తరువాయి 2లో

## దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

- పద్మ అవార్డుల కోసం ఏ వ్యక్తి అయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు
- ప్రతి పౌరుడు దేశం కోసం ఎంతోకొంత తోడ్పాటు అందించాలి

**ప్రధాని నరేంద్ర మోదీ**



దిల్లీ: మన దేశంలో గతంలో పద్మ పురస్కారాలు ఎలా దక్కేవో అందరికీ తెలుసునని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం దిల్లీలో జరిగిన యువ పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన ప్రసంగించారు. పద్మ అవార్డులకు ఎంపిక చేసే విధానంలో తాము సంస్కరణలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం పద్మ అవార్డుల కోసం ఏ వ్యక్తి అయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఎవరికీ తెలియని హీరోలు కూడా గుర్తింపు పొందుతున్నారని అన్నారు. ప్రతి పౌరుడు దేశం కోసం ఎంతోకొంత తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వంలో విధానాలు రూపకల్పన చేయగలిగే యువతతో నేడు సమావేశమయ్యానంటూ ఆయన వ్యాఖ్యానించారు. దేశం కోసం యువతతో పాటు సీనియర్లు కూడా కలిసిమెలిసి పనిచేయాలని అన్నారు.

## చేయి కలిపితే బీజేపీ ఎక్కడా కనిపించదు : రాహుల్



న్యూఢిల్లీ : మనం కలిసి పోరాడితే, వీళ్లు (బీజేపీ) ఎక్కడా కనిపించరు అని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. జనతాదళ్ యునైటెడ్ అగ్ర నేత శరద్ యాదవ్ గురువారం నిర్వహించిన సంఝి విరాసత్ బచావో (వారసత్వాన్ని కాపాడండి) సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎక్కడికెళ్ళినా అబద్ధాలే చెప్తున్నారన్నారు. ప్రజలు సచ్ భారత్‌ను కోరుకుంటున్నారన్నారు. మోదీ ఆర్భాటంగా ప్రకటించిన మేక్ ఇన్ ఇండియా ఓ ప్రహసనమని ఎద్దేవా చేశారు. ఆయన ఆర్ఎస్ఎస్‌పై కూడా విరుచుకుపడ్డారు. ఆర్ఎస్ఎస్ విభజన ఎజెండాను అనుసరిస్తోందన్నారు. ఒకరు ఈ దేశం నాది అంటారు, మరొకరు నేను ఈ దేశానికి చెందినవాడిని అంటారు. ఆర్ఎస్ఎస్‌కు, మాకు అదే తేడా అన్నారు.

న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన ఈ సమావేశంలో శరద్ యాదవ్‌తో పాటు తరువాయి 2లో










# నేడు ఋణం పొందు లబ్దిదారులకు ఇంటర్వ్యూలు



రావులపాలెం : మండలంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఎస్.సి., బి.సి., ఎస్.టి., కాపు మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా ఋణము పొందు లబ్దిదారులకు నేడు ఉదయం 11 గంటల నుండి ఇంటర్వ్యూల నిర్వహిస్తామని ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, లక్ష్మీపోలవరం, రావులపాలెం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రాంచిల ద్వారా పొందు ఋణ మంజూరు దార్లు పాల్గొనాలని ఆయన అన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు విజయా బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్ (మెయిన్), కెనరా బ్యాంక్, కార్పోరేషన్ బ్యాంక్, జిల్లా సహకార కోఆపరేటివ్ బ్యాంక్, ఐడిబిఐ బ్యాంకుల లబ్దిదారులు పాల్గొనాలని ఆయన అన్నారు. అనంతరం రావులపాలెం మండలంలో యన్.టి.ఆర్. గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఈతకోటలో గృహనిర్మాణమునకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సిహెచ్ ఉదయ భాస్కర్, వి.యస్‌యస్ కృష్ణారావు, కముజు గణపతి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాశీపట్నం బ్యాంకు పరిధిలో ఋణధరఖాస్తు ధారులకు ఈరోజు ఇంటర్వ్యూ

అనంతగిరి : మండలంలో కాశీపట్నం బ్యాంకు పరిధిలో భీంపోలు, గుమ్మకోట గరుగుబిల్లి రొంపల్లి. చిలకలగెడ్డ కాశీపట్నం నరశింహ రాజపురం కొత్తూరు పంచాయతీలలో నున్న గిరిజన షెడ్యూల్డు కులములు మరియు వెనుక బడినతరగతు లవారికి కాశీపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద కాశీపట్నం బ్యాంకు స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజరు శ్యామ్ సుందర్ అనంతగిరి మండలప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి రమేష్ రామన్, మండల ప్రజా పరిషత్ అద్యక్షులు గుజ్జెల పైడితల్లి ఆద్వర్యం లో లబ్ది దారులకు ఇంటర్వ్యూలు జరిగినవి గిరిజనులకు 39 అప్లికేషన్లు వెనుకబడినతరగతి వారివి మూడు అప్లికేషన్లు షెడ్యూల్డు కులము లవారివి మూడు దరఖాస్తులు వచ్చాయని అన్నింటిని పరిశీలిం చామని అధికారులు తెలిపారు.

జీనబాడు పినకోట పెదకోట కివర్ల పంచాయతీలోగల ఋణముల గురించి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు గిరిజన బీ సి షెడ్యూల్డు కులములవారు దేవరాపల్లి యుకో బ్యాంకువద్ద ఇంటర్వ్యూ జరుగునని తప్పక హాజరు కాగలరని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్ రామన్ తెలిపారు

## భీమునిపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం




భీమునిపట్నం : భీమునిపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరు పలు అంశాలపై చర్చించారు. ఈ సామావేశానికి ఎం.పి.పి. యరబాల కృష్ణవేణి అధ్యక్షత వహించారు. ఇందులో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. హరిప్రసాదరావు, జడ్.పి.టి.సి. ఎస్. అప్పారావు, పాశి నర్సింగరావు, అధికారులు శ్రీనివాసరావు, విస్తరణాధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కోల్డ్ స్టోరేజికి ప్రభుత్వ ఏర్పాట్లు

కొయ్యూరు : రైతు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు వీలుగా మండలంలో కోల్డ్ స్టోరేజ్‌తో పాటు ఆహార ఉత్తర్వుల ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి స్థలం కేటాయించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం వీలుగా చర్యలు తీసుకుంది. జిల్లాకు ఒక ఆహార ఉత్పత్తుల ప్రొసెసింగ్ కేంద్రం ఉంటే నష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు నిపుణులు సూచనను ప్రభుత్వం ఎట్టకేలకు పరిగణలోకి తీసుకుంది. ఈ విషయమై గత ప్రభుత్వాల హయాంలో మార్కెటింగ్, వ్యవసాయశాఖలు దృష్టి పెట్టక పోవడంతో రైతాంగం తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఏజెన్సీలో ఈ పరిస్థితి మరింత దారుణమైంది. ఈ పంటకైనా గిట్టుబాటు ధర వచ్చే వరకు జరిగితే పంట నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ, వ్యవసాయశాఖ సంయుక్తంగా మండలానికి అందుబాటులో ఉండేలా డౌనూరు, మూలపేట పంచాయతీల మధ్యలో రెడు ఎకరాల ప్రభుత్వ స్థలం గుర్తించి వివరాలు నివేదించాలని కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ దిశగా రెవెన్యూ, అధికారులు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు వీలుగా మూలపేట పంచాయతీలో సర్వే నెంబరు 24/1సిలో గల ప్రభుత్వ భూమిలో 2.60 ఎకరాల భూమిని కేటాయించామని తహసీల్దార్ తెలిపారు. సంబంధించిన ఎఫ్‌ఎంబి భూరికార్డులను పాడేరు ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు పంపామని వివరించారు.

## అన్నదాతల సమస్యలపై విపక్షాల ఆందోళన

కోయంబత్తూరు : డీఎంకే రైతు విభాగం సారథ్యంలో వివిధ పార్టీలకు చెందిన వేయి మంది నాయకులు, కార్య కర్తలు ఆందోళన చేపట్టారు. దక్షిణ తహ సీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని డీఎంకే రైతు విభాగ కార్యదర్శి కేపీ రామలింగం పేర్కొన్నారు. రైతుల దీనావస్థపై ముఖ్యమంత్రి పళనిస్వామి ఒక్కమాటయినా మాట్లాడకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 30న వ్యవసాయ రుణాల మాఫీ, కావేరి మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్రం మీద ఒత్తిడి తేవాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని ముఖ్య మంత్రికి సమర్పించామన్నారు. తప్ప కుండా తగిన చర్యలు తీసు కుంటానని ఆయన మాట ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

డీఎంకే జిల్లా కార్య దర్శులు ఎం.కార్తిక్ (అర్బన్ సౌత్), ముత్తుస్వామి (అర్బన్ నార్త్), తమిళ్‌మణి, సీఆర్ రవిచంద్రన్, మయూర జయ కుమార్ (అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు), ఆరుముగం (సీపీఐ), రామమూర్తి (సీపీఎం), ఆరుచామి (తందయి పెరి యార్ ద్రావిడ కళగం), మాజీ మంత్రులు పొంగళూరు పళనిస్వామి, కన్న ప్పన్ పాల్గొన్నారు.

## ఘనంగా సత్తెమ్మ తల్లి విగ్రహావిష్కరణ

రావులపాలెం : మండల పరిధి, గోపాలపురంలో నూతనంగా శ్రీశ్రీ సత్తెమ్మ తల్లి పుట్ట ఆలయాన్ని గ్రామస్తుల సహకారంతో నిర్మించారు. ఈ ఆలయంలో గురువారం రజక సంఘం ఆధ్వర్యంలో వేద మంత్రాల సాక్షిగా ఘనంగా అమ్మవారి పుట్ట గృహప్రవేశం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి, సర్పంచ్ మైగాపుల గురవయ్యానాయుడు, పడాల నాగ మహేశ్వరరెడ్డి, రజక సంఘ పెద్దలు, యువకులు, కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆదాయం 21 లక్షలు



రావులపాలెం : కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం 21 లక్షల 43 వేల 904 రూపాయలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ కరటూరి నరసింహారావు గురువారం తెలిపారు. పి.టి.వి.వి. సత్యనారాయణమూర్తి, ఎమ్. సత్యనారాయణరాజులు సిహెచ్ ఉదయ బాబు నాయుడు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో హుండీ లెక్కింపు కొనసాగింది. ప్రధాన హుండీల ద్వారా 16 లక్షల 85 వేల 122 రూపాయలు రాగా అన్నదాన పథకం ద్వారా 4 లక్షల 58 వేల 782 రూపాయలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖండవిల్లి రాజేశ్వర వర ప్రసాద్ గారి బ్రహ్మత్వంలో, సాయిరామ్, శిఖా నరేన్ చక్రవర్తి, శివ, తోటకూర సుబ్బరాజు, ఏపుగంటి రాజు, నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులు

రావికమతం : విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి స్వతంత్ర దినోత్సవం నాడు అవార్డులు ప్రధానం చేశారు. వీటిని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా అందజేశారు. కొత్తకోట సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలకు గుర్తింపుగా సిఐ కోటేశ్వరరావుకు జిల్లా ఉత్తమ సిఐగా అవార్డు లభించింది. ఉపాధి హామీ పథకం అమలులో చక్కని పనితీరు కనబరిచి, 337 100 రోజులు పని కల్పించినందుకు కొమిర వీఆర్పీ మత్సా శ్రీనివాసరావుకు మండల ఉత్తమ వీఆర్పీగా ఎంపిక చేశారు.

## నేటి నుంచి ఐఏఎఫ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

రావికమతం : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూపు వైఐఏఎఫ్(ఎస్) ట్రేడ్ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18, 19న విశాఖ సెట్విన్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపిడిఒ జయప్రకాశరావు తెలిపారు. వచ్చే నెల 9న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారని, అందులో పాల్గనేందుకు ఈ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారని పేర్కొన్నారు. ఇంటర్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఇంగ్లీషులో 50శాతం మార్కులు వచ్చిన అభ్యర్థులే ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు తమ కుల, ఆదాయ, విద్యార్హతల అసలు ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో పాటు జెరాక్స్ సెట్‌ను తీసుకుని హాజరు కావాలని కోరారు.

## ఘనంగా పొలిమేరమ్మ జాతర

యలమంచిలి రూరల్ : యర్రవరం గ్రామదేవత పొలిమేరమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి తెల్లవారుజాము నుంచి భక్తులు పసుపు, కుంకుమలు నైద్యాలు సమర్పించేందుకు భారీ ఎత్తున క్యూలు కట్టారు. పండుగ నేపథ్యంలో ఆలయం విద్యుత్ అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కమిటీ సభ్యులు కల్పించారు. అనంతరం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**మొదటి పేజీ తరువాయి**

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఏపీ ఐఐసీకి 220 ఎకరాల కేటాయింపు**

విశాఖ జిల్లాలో ఏపీఐఐసీకి భూములు కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పారిశ్రామిక పార్కు ఏర్పాటుతో పాటు పరిశ్రమల కోసం ప్రభుత్వం 220 ఎకరాల భూమిని కేటాయించింది. పద్మనాభం మండలం పెంట గ్రామంలో 200 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఉచితంగా కేటాయించింది. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటుచేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగయ్యేందుకు వీలు ఏర్పడనుంది. రాంబిల్లి మండలం పూడి గ్రామంలో 21.89 ఎకరాలను కూడా ప్రభుత్వం ఏపీఐఐసీకి కేటాయించింది.

## 31న నింగిలోకి పీఎస్ఎల్వీ సీ-39

పంపనున్నట్లు చెప్పారు. పీఎస్ఎల్వీ సీ-40, 41 కూడా ఈ ఏడాది ప్రయోగిస్తామని తెలిపారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను తిరుగులేని శక్తిగా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

## *రూ.40 కోట్ల విలువైన కొకైన్ పట్టివేత*

చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి దాదాపు రూ.40 కోట్ల విలువైన కొకైన్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడుతున్నారన్న సమాచారంతో ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో టాంజానియా, నైజీరియాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద 4 కిలోల కొకైన్ లభించింది.

మార్కెట్‌లో దీని విలువ దాదాపు రూ.40 కోట్లు ఉంటుందని నార్కోటిక్స్ విభాగం అధికారులు తెలిపారు. టాంజానియా, నైజిరియాకు చెందిన వీరిద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## 16 పబ్‌లకు సిట్ నోటీసులు

పలు పబ్‌లకు నోటీసులు పంపించింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఇటీవల సినీ ప్రముఖులు, కెల్విన్ తదితర వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు నగరంలో మత్తుమందులను వ్యాప్తి చేయడానికి కారణమవుతున్న పలు పబ్‌లను అధికారులు గుర్తించారు. తాజాగా ఈ అంశంపై తెలంగాణ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక దృష్టి సారించింది. సిట్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఇప్పటివరకూ 16 పబ్‌లకు నోటీసులు పంపించారు. శనివారం (ఆగస్టు 19) ఉదయం 11 గంటలకు సిట్ ఆఫీసులో హాజరు కావాలని ఆయా పబ్ ఓనర్లను ఆదేశించారు. ఎక్సైజ్ పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన కెల్విన్ సహా పలువురు నిందితులు.. తాము డ్రగ్స్ విక్రయించడానికి తరచూ కొన్ని పబ్‌లకు వెళుతుంటామని తెలిపారు. సదరు పబ్‌లు మత్తుమందుల విక్రయానికి అడ్డాగా మారినట్లు తేలితే వాటి లైసెన్స్ రద్దు చేయనున్నారు. ఇందులో పబ్ మేనేజర్లకు కూడా ప్రమేయం ఉందని తేలితే.. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

## మాతాశిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యం



రామానాయుడు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ లాలం భవానీ, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ ఎంవిఎస్.సుధాశారదా, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, నర్సీపట్నం ఎంపిపి సుకల రమణమ్మ తదితరులు ఆసుపత్రుల్లోని పలు వార్డులను, లిఫ్టలను, ఎన్టీఆర్ ఆరోగ్యసేవా వార్డులను, రిమోట్ ఆపరేషన్ మంచాలను, రిమోట్ డెలివరీ మంచాలను, ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వీరు మాట్లాడుతూ ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుండి అంగన్వాడీ కార్యకర్త సేవలు ప్రారంభిస్తుందన్నారు. బిడ్డ ఆరు సంవత్సరాలు పూర్తయ్యేంత వరకు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఏఎన్ఎంల నుండి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ పురుడు పోసుకునే విధంగా అనేక రకాల ప్రోత్సహిక కార్యక్రమాలను, డబ్బును ఏర్పాటు చేసి ప్రభుత్వం సంరక్షిస్తుందన్నారు. అనంతరం ఆసుపత్రిని చక్కగా నిర్మించిన కాంట్రాక్టర్ సురేంద్రను, నర్సీపట్నం మున్సిపాలిటీకి రూ.10లక్షలతో కైలాసవివాహం ఇచ్చిన సిఎంఆర్ అధినేత , రూ.25లక్షలతో నర్సీపట్నంలో భారీ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన కొప్పర్తి రామారావు దంపతులను, ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్‌ను మంత్రి ఘనంగా సన్మానించారు.

**చేయి కలిపితే బీజేపీ ఎక్కడా కనిపించదు : రాహుల్**

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, సీపీఎం నేత సీతారాం ఏచూరి, టీఎంసీ, బీఎస్పీ, ఎన్‌సీపీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించాలి'



వేలూరు : వూరీసు కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించే వారికి అవకాశాలు కల్పించాలని వేలూరు వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇక్కడ విద్యనభ్యసించి అనేక రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ స్టాన్లీ జోన్స్ కరుణాకరన్ అధ్యక్షతన కళాశాల ఆడిటోరియంలో కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా వేలూరు సీఎస్ఐ డయోసిస్ పేరాయర్ రాజవేలు పాల్గొన్నారు. విద్యా రంగంలో రాణిస్తున్న వీఐటీ కులపతి జి.విశ్వనాథన్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ ప్రసంగిస్తూ... వూరీసు కళా శాల 119 సంవత్సరాల పురా తన మైనదని గుర్తుచేశారు. డాక్టరు సర్వేపల్లి రాధాక ృష?న్ లాంటి మహామహులు ఇక్కడ విద్యనభ్యసించారని తెలిపారు. 1955లో ఇక్కడ ఇంటర్మీడియట్ వరకు చది వానని పేర్కొన్నారు. గణితం, సైన్సు పాఠాలు నచ్చక ఆర్ట్స్ చదివానని... ప్రస్తుతం ఇంజినీరింగు కళాశాల స్థాపించి దాన్ని విశ్వవిద్యాలయ స్థాయికి తీసుకొచ్చానని తెలిపారు. ప్రస్తుతం ఈ కళాశాలలో 4 వేల మంది చదువుతున్నట్లు తెలిసిందని... ఈ సంఖ్యను మరింత పెంచడానికి కళాశాల నిర్వాహకం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎప్పుడో ఇది విశ్వవిద్యాలయ స్థాయికి చేరి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. కళాశాలలో తరగతి గదుల కొరత ఉన్నట్లు తన ద ృష్టికి వచ్చిందని... నిర్మాణానికి సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ బాల్‌రాజ్, విశ్రాంత ప్రిన్సిపల్ డేనియల్ ఎళిలరసు, కళాశాల కార్యదర్శి శర్మనిత్యానందం, పూర్వ విద్యార్థి కదరివన్, న్యాయవాది నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



అనకాపల్లి : వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మేళాతాళాలలో వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంఘా జరిగింది. మండలంలో సీతానగరం గ్రామంలో మాజీ సర్పంచ్ సుంకర చంటి ధన సహాయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్టా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్వామి వారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించి తరించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్య క్రమంలో సర్పంచ్ గంగు పాం మహేష్, తాడి రామకృష్ణ, సకల గోవిందరావు, శ్రీరాందాసు గోవింద, సుంకర రవి, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు స్పందించండి



సింహచలం: 72 వార్డు పరిధిలో లండగరువు, అడవివరం, విజినిగిరిపాలెం గ్రామలలో సర్వే చేయగా నేల బావులు సుమారుగా 10 ఉన్నవి. అయితే ఇవి చాలా ప్రమాదకరంగా మారాయి, పూర్వం నుండి ఈ నేల బావులు నుంచి పంటలు పండించు పొలాలకు నీరు అందుతుంది. రానురాను జనాభా పెరుగుదల వలన ఇవి చాలా ఇబ్బంది కరంగా మారాయి.ఉదయం లేచినది. మొదలు పాఠశాలకు వెళ్లు బాలబాలికల నుండి పెద్దల వరకు ఈ నేలబావుల వెంబడే ప్రయాణం సాగించాలి పొరపాటున కాలు జారితే ప్రాణ గండమే ఇది వరకు ఇద్దరు గృహిణిలు చేదతో నీరు తోడు చుండగా కాలు జారీ మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి.కనుక దయచేసి వెంటనే ఈ నేల బావులకు రక్షణ గోడలు నిర్మాణం చేపట్టే విధంగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రవీణకుమార్ స్పందించి చర్యలు తీసుకోవలసినదిగా కోరుచున్నాను

# భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

పరవాడ : పరవాడ మండలము నాయుడు పాలెం పంచాయితీ కోరంగివాని పాలెంలో ఒకరు అత్మహత్య చేసుకున్నారు. మృతురాలు అన్నయ్య సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ పోలీసులుతెల్పిన వివరాలు ప్రకారము నాయుడుపాలెం పంచాయితీ కోరంగివాని పాలెంలో భర్త వేధింపులు తాళలేక భార్య కోరంగి లక్ష్మీ (34) ఉరి వేసుకొని అత్మ హత్య చేసుకుంది. ఈమె భర్త అప్పలరాజు, వీరికి ఇద్దరు పిల్లలు ఆశోక్, ప్రమీల ఉన్నారు. దువ్వాడ సిఐ ఆధ్వర్యంలో పరవాడ ఎస్ .ఐ. వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సింహగిరీశునికి
## నిత్యాన్నదాన ప్రసాదంకు రూ.1లక్ష విరాళం



సింహాచలం : సింహాద్రి నాధునికి విరాళంగా రూ.1,00,000/- లు ఆలయ సహాయ కార్య నిర్వాహణాధికారి ఎంవికె ఆచార్యులకు అందించారు. ఆలయ మర్యాదలప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద పండితులచే ఆశీర్వచనం చేయించి ప్రసాదాలను అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు , డిడి రూపేణావిరాళం ఇచ్చినా సంబందిత అధికారివద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చినా విరాళాలు స్వామివారికి చెందవు అని ఓప్రకటనలో అధికారులు తెలిపారు. డిపాజిట్ చేసిన మొత్తం నుంచి వచ్చిన వడ్డీతో భక్తులు కోరినరోజు అన్నదానం నిర్వహించటం జరుగుతుంది. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్న 94910 00635 నెంబర్ కు సంప్రదించవచ్చు లేదంటే నేరుగా మమ్మల్ని అంటే దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వారిని సంప్రదించగలరని కార్యనిర్వాహణాకారి కోడూరి అచ్చుత రామచంద్రమోహన్ కోరారు.

## నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

### వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తుంపాల అప్పారావు



సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు (శుక్రవారం) సబ్బవరం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించబడునట్లు వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు తుంపాల అప్పారావు విలేకర్లకు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు కార్యవర్గ సమావేశం జరుగును. ఈ సమావేశానికి ముఖ్య అతీతంగా పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి, అదీప్‌రాజ్ పాల్గొననట్లు పేర్కొన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

## బివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎంవి.రాజశేఖర్ నియామకం



విశాఖపట్నం : భారత వికాస్ పరిషత్ విశాఖ నగర శాఖ అభ్యున్నతికి కృషి చేస్తూ గతంలో రెండు పర్యాయాలు నగర శాఖ కార్యదర్శిగాను మరియు అధ్యక్షునిగాను తదుపరి రాష్ట్ర స్థాయిలో పిఆర్‌ఓగాను, సంస్థకు విశేషమైన సేవలందించినందుకు గాను భారత వికాస పరిషత్ రాష్ట్ర శాఖకు కార్యవర్గసభ్యునిగా ఎం.వి.రాజశేఖర్‌ను ఎన్నుకోవడం జరిగింది. వీరు 2017-18కి గాను భారత్ వికాస్ రాష్ట్ర స్థాయిలో చేపట్టే దేశభక్తి సేవా కార్యక్రమాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

# తూర్పు కోస్తా రైల్వే స్వచ్ఛత పక్షోత్సవాలు



విశాఖపట్నం: రైల్వే మంత్రిత్వశాఖ పిలుపుమేరకు తూర్పు కోస్తా రైల్వే స్వచ్ఛత పక్షోత్సవాలు జరుపుతుంది. ఇందులో భాగంగా పలు ఎన్‌జిఓ సంస్థలతో అనుబంధంగా డివిజనల్ అధికారులు స్వచ్ఛత సదస్సులు నిర్వహించనున్నారు. విశాఖ రైల్వే స్టేషనులో సంత్ నిరంకారి స్వచ్ఛంద సంస్థ స్వచ్ఛతపై అవగాహన కల్పించనుంది. ఈనెల 31 వరకు స్వచ్ఛత అవగాహన కార్యక్రమాలు జరుగనున్నాయి.



# రైల్వే రక్షణ గోడ తొలగింపునకు చర్యలు



కంచరపాలెం: ఇటీవల గ్రేటర్ విశాఖ 40వవార్డు పరిధి మర్రిపాలెం వద్ద రైల్వే క్వార్టర్స్ ఆనుకొని రైల్వే అధికారులు నిర్మించి తలపెట్టిన రక్షణ గోడ నిర్మాణ పనులను స్థానికులు అడ్డుకుని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌డివోకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌డీవో వెంకటేశ్వరరావు, వాస్తవాలను పరిశీలించి రైల్వే ఉన్నతాధికారులతో చర్చిస్తామని సూచించారు.

ఈ విషయమై రైల్వే ఉన్నతాధి కారులకు గోడనిర్మాణం వలన సమీపంలో వున్న స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందని వివరించారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు గోడ తొలగింపునకు అంగీక రించారు. ఆర్‌డివో ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ సిబ్బంది పూర్తిస్థాయిలో గోడను తొలగించారు. కార్యక్రమాన్ని అర్బన్ మండల సర్వేయర్ రాజగోపాల్, ఆర్‌ఐ చైతన్య, గణేష్ పర్యవేక్షించగా విఆర్‌ఓ రామనాయుడు, విఆర్‌ఎ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

### 279జీఓ రద్దు చేయాలని
## ఈనెల 22న ఛలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ



విశాఖపట్నం : 279జీఓ రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికులు ఈనెల 22న ఛలో విజయవాడ హాజరు కావాలని జివియంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిస్తుంది. దీనిలో భాగంగా ఈ రోజు జివియంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆఫీసులో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. దీనిని ఉద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.నూకరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల కడుపులు కొట్టే 279జీఓ ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఈ జీఓ వలన కార్మికులే కాకుండా ప్రజలపై కూడా భారాలు పడతాయని అన్నారు. 279జీఓ అంటే మున్సిపాలిటీలను కార్పొరేషన్లను భడా కాంట్రాక్టర్లకు కట్టబెట్టడమే తప్ప నగర ప్రజలకు గానీ, కార్మికులకు గానీ ఏవిధమైన లాభం ఉండదని అన్నారు. ఈ జీఓని వెంటనే రద్దు చేయాలని జరిగే ఈ నెల 22న విశాఖపట్నంలో ఉన్న పారిశుధ్య కార్మికులంతా ఛలో విజయవాడ తరలిరావాలని అప్పటికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే అక్కడే నిరవధిక సమ్మెకు వెళ్ళతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యదర్శి గొలగాని అప్పారావు, ఉపాధ్యక్షులు ఉరుకూటీ రాజు, రాంబాబు, ఎమ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

# రూ.2.17 కోట్లతో గ్రంధాలయాల అభివృద్ధి



విశాఖపట్నం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని గ్రంధాలయాల అభివృద్ధికి రూ.2.17 కోట్లు వెచ్చించాలని జిల్లా గ్రంధాలయాల సంస్థ ఇన్‌ఛార్జి మరియు జాయింట్ కలెక్టర్ జి.సృజన నేతృత్వంలో జరిగిన జిల్లా గ్రంధాలయ కమిటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. గ్రంధాలయాల భవన నిర్మాణాలు, మరమ్మత్తులు, పుస్తకాలు, ఫర్నీచర్, ఇతర సామగ్రి కొనుగోలుకు ఈ నిధులను వెచ్చించేందుకు అవసరమైన పరిపాలనా అనుమతులు పొందేందుకై పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ బంగ్లాలో జిల్లా గ్రంథాలయ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు చెల్లింపు, గ్రంథాలయాల నిర్వహణ, ఇతర ఖర్చులకు గాను రూ.10.95 కోట్లను వెచ్చించేందుకు ఈకమిటీ ఆమోదం తెలిపింది. జిల్లాలోని 63 శాఖా గ్రంథాలయాలు, 5 గ్రామీణ గ్రంథాలయాల్లో కంటింజెంటు స్వీపర్లుగా పని చేస్తున్న వారి రెమ్యునరేషన్ పెంచేందుకు తీర్మానించారు. జివియంసి పరిధిలోని రెండంతస్తుల భవనాలు గల 12 గ్రంథాలయాల్లో పనిచేసే వారికి నెలకు రూ.3,000లు, మిగిలిన 51 గ్రంథాలయాల్లో పనిచేసే వారికి రూ.2,000లు, గ్రామీణ గ్రంథాలయాల్లో పనిచేసే వారికి రూ.1,000లు రెమ్యునరేషన్ చెల్లించేందుకు నిర్ణయించారు.

**రూ.47.65 కోట్ల బకాయిలు నెలవారీగా చెల్లించాలి...**

మహా విశాఖ నగర పాలక సంస్థ జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిలు రూ.47.65 కోట్లను నెలవారీగా చెల్లించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ ఇన్‌ఛార్జి మరియు జాయింట్ కలెక్టర్ జి.సృజన జివియంసి అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రూ.47.65 కోట్ల పన్ను బకాయి లను ప్రతి మాసం రూ.20లక్షలు చొప్పున ఇకపై చెల్లించాలన్నారు. పంచాయితీశాఖ చెల్లించాల్సిన పన్ను బకాయిలు రూ.2కోట్లను కూడా ఒక మాసం గడువులో చెల్లించాలని పంచాయితీ అధికారులను ఆమె ఆదేశించారు.

ఈ సమావేశంలో జివియంసి అదనపు కమిషనర్ వర్మ, రవీంద్ర, ఎన్‌విఆర్‌వి. కుమార్, వి.వి.రమణబాబు, పి.ఉదయకుమార్ తదితరులతో పాటు విద్య, పంచాయితీ, సమాచార పౌర సంబంధాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆధారిత సంవత్సరం మార్పుకై దక్షిణాది రాష్ట్రాల సమావేశం



విశాఖపట్నం : పారిశ్రామిక ఉత్పత్తి సూచీ సంఖ్య (IIP) అనునది పరిశ్రమల పనితీరును తెలియచేయు స్వల్పకాలిక నెలవారీ సూచిక. భారతదేశమునకు సంబంధించిన పారిశ్రామిక ఉత్పత్తి సూచీ సంఖ్యలను సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (CSO) వారు గణన చేయుదురు. రాష్ట్రములకు సంబంధించిన సూచీ సంఖ్యలను సంబంధిత రాష్ట్రములు గణన చేయుదురు. ఈ పారిశ్రామిక సూచీ సంఖ్యల వలన చాలా ఉపయోగములు కలవు. ఇవి ముఖ్యముగా విధాన నిర్ణయములను చేయుటకు, పరిశ్రమల గురించి విశ్లేసించుటకు మరియు పరిశోధకులకు మిక్కిలి ఉపయోగకరము. గనులు, తయారీ రంగము మరియు విద్యుత్చక్తి అను మూడు విభాగములపై పారిశ్రామిక ఉత్పత్తి సూచీ సంఖ్యలను తయారు చేయడం జరుగుతుంది. సంబంధిత విభాగముల నుంచి సేకరించిన సమాచారంతో భారతదేశపు పారిశ్రామిక ఉత్పత్తి సూచీ సంఖ్యలను తయారు చేయబడును. రాష్ట్రాలకు సంబంధించినంతవరకు తయారీ రంగమునకు సంబంధించిన వివరములను వివిధ గ్రూపులకు చెందిన ఎంపిక కాబడిన పరిశ్రమల నుండి, గనులకు సంబంధించిన వివరములను గనుల విభాగము నుండి మరియు విద్యుత్చక్తి సంబంధించిన వివరములను విద్యుత్చక్తి విభాగము నుండి నెలవారీగా సేకరించి పారిశ్రామిక ఉత్పత్తి సూచీ సంఖ్యలు తయారు చేయబడును. ఈ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ సంఖ్యలకు సంబంధించిన ఆధారిత సంవత్సరమును 2004-05 నుండి 2011-12 నకు కేంద్రప్రభుత్వం వారు మార్చుట జరిగినది. దీనికి అనుగుణముగా రాష్ట్ర ప్రభుత్వములు కూడా ఆధారిత సంవత్సరమును మార్చుటకు సన్నాహక చర్యలు తీసుకోవటం జరుగుతుంది. ఆధారిత సంవత్సరమును మార్చుటకు దక్షిణాది రాష్ట్రములు తీసుకున్న చర్యలను తెలుసుకొనుటకు గురువారం విశాఖపట్నము నందు ప్రాంతీయ సమావేశమును ఏర్పాటు చేయబడినది. దక్షిణాది రాష్ట్రములైన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ మరియు పుదుచ్చేరికి చెందిన అధికారులు హాజరైనారు. ఎన్.యోగేశ్వర శాస్త్రి, సంచాలకులు, అర్థ గణాంక శాఖ వారు ఆహుతులకు స్వాగతం తెలుపగా ఎం.వి.ఎస్. రంగనాథం, అడిషినల్ డైరెక్టర్ జనరల్ వారు సమావేశము నిర్వహించుటకు గల కారణములను తెలియచేసినారు. ఎన్.రెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి, ప్రణాళిక విభాగము, ఆంధ్ర ప్రదేశ్ వారు నాణ్యమైన గణాంకాలను అందించవలసిన ఆవశ్యకతను తెలియచేయుచు సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (CSO) వారి అనుభవాలనుంచి ప్రయోజనం పొందవలసిందిగా కోరియున్నారు. సమావేశమునకు హాజరైన వివిధ రాష్ట్రముల అధికారులు ఆధారిత సంవత్సరము మార్చుటకు తీసుకున్న చర్యలు, ఎదుర్కొనుచున్న ఇబ్బందులు మరియు పూర్తి చేయుటకు అవసరమగు సమయమును తెలియచేసినారు. సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (CSO) వారు తగు సూచనలు ఇచ్చుచూ ఆధారిత సంవత్సరము మార్చుటకు సంబంధించిన వివరములను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయవలసిందిగా కోరడమైనది. ఈ ప్రాంతీయ సమావేశమునకు సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (CSO) అధికారులు లక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, రాజేష్ కుమార్ శర్మ, డైరెక్టర్ మరియు సిద్దార్థ కుందు, డైరెక్టర్ వారు కూడా హాజరై పాల్గొనిన అధికారుల సందేహాలను నివృత్తి చేసినారు.

# నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

### వైఎస్ఆర్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్



అచ్యుతాపురం: నవరత్నాలతో నవ్యాంధ్రకు మంచిపాలనను ప్రజలకు అందించడానికి జగన్ అన్న వస్తున్నాడని వైఎస్ఆర్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ అన్నారు. గురువారం మత్స్యకార గ్రామమైన పూడిమడకలో వైకాపా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలను గడప గడపకు ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు.చంద్రబాబు అవినీతి పాలనపై ప్రజలకు వివరిం చాలన్నారు. ఈ కార్య క్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపల వెంకటరమణ, జిల్లా మత్స్యకార నాయకులు చోడిపల్లి అప్పారావు, జిల్లా కార్యదర్శి నర్మాల రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షులు గండిబోయిన వెంకట్, పిన్నంరాజు వాసు, దాసరి లక్ష్మణరావు, వైకాపా గ్రామపార్టీ అధ్యక్షులు మేరుగు అప్పలనాయుడు, చోడిపల్లి పెంటయ్య, ఎరిపల్లి శ్రీను, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయభాను
## సంపాదకీయం

### రాగద్వేషాలకు అతీతంగ ఉండాలి

అమెరికాలో శ్వేత దురహంకారం పెచ్చరిల్లిపోతున్నది. కొన్ని తెల్లజాత్యహంకార సంస్థలు విద్వేషాలను రగిలించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ విద్వేష భావజాలానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఉద్యమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్వేత ఆధిపత్య భావజాలాన్ని నిస్సంకోచంగా ఖండించడానికి బదులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరుపక్షాలను ఒకే గాటన కడుతూ మాట్లాడటం ఆశ్చర్యంగా ఉన్నది. వర్జీనియాలోని చార్లొట్స్‌విల్లేలో చెలరేగిన హింసను ఖండించడానికి కూడా ట్రంప్ మొదట తాత్సారం చేశారు. ఆ తరువాత శ్వేత దురహంకారులను వెనకేసుకొస్తూ మాట్లాడారు. తప్పనిసరై విద్వేషాలను ఖండించినా, ట్రంప్ మొగ్గ శ్వేత దురహంకారుల వైపే ఉండటం గమనార్హం. అబ్రహాం లింకన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికాలో బానిసత్వాన్ని రద్దు చేయాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. అభివృద్ధి చెందిన ఉత్తరాది రాష్ట్రాలకు భిన్నంగా, వ్యవసాయం ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న దక్షిణాది రాష్ట్రాల పాలకవర్గాలు బానిసత్వాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకించాయి. ఈ రాష్ట్రాలు అమెరికా నుంచి విడిపోవడానికి యత్నించడంతో అంతర్యుద్ధం జరిగింది. దక్షిణాది రాష్ట్రాల సైన్యాలకు నాయకత్వం వహించిన సైన్యాధిపతులు రాబర్ట్ ఇ లీ, స్టోన్‌వాల్ జాక్సన్‌లను శ్వేత దురహంకారులు ఇప్పటికీ జాతి హీరోలుగా భావిస్తుంటారు. చార్లొట్స్‌విల్లేలో ఎంతోకాలంగా ఉంటున్న రాబర్ట్ ఇ లీ విగ్రహాన్ని తొలిగించాలని నిర్ణయించడంతో వివాదం మొదలైంది.

చార్లొట్స్‌విల్లేలో రాబర్ట్ ఇ లీ విగ్రహం తొలిగింపునకు వ్యతిరేకంగా శ్వేత దురహంకారులు ఊరేగింపు తీశారు. ఈ విద్వేష భావజాలాన్ని వ్యతిరేకిస్తూ లౌకిక, ప్రజాస్వామిక శక్తులు కదిలివచ్చాయి. ఈ ఉద్రిక్త పరిస్థితులలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. శ్వేతదురహంకార వర్గాని కి చెందిన ఒకరు తన కారును వ్యతిరేకవర్గం వారిపైకి నడుపడంతో పౌరహక్కుల కార్యకర్త ఒకరు మరణించారు. ఇంతగా తెగించినప్పటికీ శ్వేత దురహంకారులను ఖండించడానికి ట్రంప్‌నకు మనసొప్పడం లేదు. ఒకవైపు చెడ్డవారున్నారు. మరోవైపు కూడా హింసాపరులు ఉన్నారు... తెల్లజాతీయవాదులను వ్యతిరేకించేవారు ఆయుధాలతో వచ్చారు. వారికి అక్కడికి రావడానికి అనుమతి లేదు... కాగడాలు పట్టుకొని వచ్చిన వారంతా నాజీలు, తెల్లజాత్యహంకారులు అనుకోవద్దు అంటూ ట్రంప్ ఇరు పక్షాలను ఒకే గాటన కట్టి మాట్లాడారు. రాబర్ట్ ఇ లీ విగ్రహాన్ని ఈ వారం కూలగొడతారు. స్టోన్‌వాల్ జాక్సన్ విగ్రహాన్ని కూడా కూలదోస్తున్నారని తెలిసింది. వచ్చే వారం జార్జి వాషింగ్టన్ విగ్రహాన్ని కూడా కూలదోస్తారా? ఆ తరువాత వారం థామస్ జెఫర్‌సన్ విగ్రహమా? అని ట్రంప్ అన్నారు. రాబర్ట్ ఇ లీ, స్టోన్‌వాల్ జాక్సన్ దేశాన్ని ముక్కలు చేయడానికి యుద్ధానికి దిగినవారు కాగా, జార్జి వాషింగ్టన్ అమెరికా జాతిపిత. థామస్ జెఫర్‌సన్ అమెరికా స్వాతం త్ర్య ప్రకటనను లిఖించిన మహానేత. ఇరువురూ దేశాన్ని పాలించి దిశానిర్దేశం చేసినవారు. అంతర్యుద్ధ కాలం నాటి శ్వేత దురహంకార సైనికాధిపతులను అమెరికా జాతి నిర్మాతలతో పోల్చడాన్ని విజ్ఞతగల వారెవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ట్రంప్ అధికారానికి వచ్చిన నాటినుంచి అనేక తప్పటడుగులు వేస్తున్నప్పటికీ, సామాజిక అశాంతి పేట్రేగిపోయే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్ర వ్యతిరేకతను స ృష్టిస్తున్నది. ఆయన వ్యాఖ్యల పట్ల దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర స్పందన కనబడుతున్నది.

ట్రంప్ వ్యాఖ్యలను ప్రతిపక్షాల వారే కాదు, ఆయన సొంత రిపబ్లికన్ పార్టీకి చెందిన పెద్దలు కూడా సమర్థించకపోవడం గమనార్హం. ట్రంప్ మొదటి నుంచీ విద్వేషాలను, జాతి వివక్షను ఉసిగొలుపుతున్నారని ప్రతినిధుల సభలోని డెమొక్రాటిక్ పార్టీ నాయకురాలు నాన్సీ పెలోసీ విమర్శించారు. శ్వేత దురహంకార మూకలు దారుణాలకు పాల్పడుతూ హత్యలు చేస్తుంటే, అమెరికా అధ్యక్షుడు దానిని అర్థం చేసుకోగలిగి ఉండాలె అని ఆమె వ్యాఖ్యానించారు. జాతి విద్వేషవాదులను, వారిని వ్యతిరేకిస్తున్న వర్గాన్ని ఒకే నైతిక కోణంలో చూడకూడదని మరో నాయకుడు హితవు చెప్పారు. మనం ఏ పక్షమో తెల్చుకోవలసిన తరుణమిది అని మాజీ అటార్నీ జనరల్ ఎరిక్ హోల్డర్ అన్నారు. శ్వేత దురహంకారం విభేదాలకు దారితీస్తుంది. దేశ విలువలకు విరుద్ధమైనది. ఈ విషయంలో నైతిక సందిగ్ధతకు తావు లేదు అని రిపబ్లికన్ పార్టీకే చెందిన స్పీకర్ పాల్ ర్యాన్ స్పష్టం చేశారు. దీనిని బట్టి ట్రంప్ విధానాలకు అమెరికా సమాజంలో మద్దతు లేదని స్పష్టమవుతున్నది. బహుళ సమాజాలలో ఒక్కోసారి విద్వేషాలు ప్రబలవచ్చు. కానీ పాలకులు రాగద్వేషాలకు అతీతంగా ఉండి అందరి మన్ననలు పొంది, వ్యవస్థ మీద నమ్మకం పెంచాలె.

# కిమ్ జాంగ్‌పై డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు



వాషింగ్టన్ : నిన్న మొన్నటి వరకూ అమెరికా, ఉత్తర కొరియా అధ్యక్షుల మధ్య మాటల యుద్ధం నడిచిన విషయం తెలిసిందే. తాజాగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. కిమ్ తెలివైన, సరైన నిర్ణయం తీసుకున్నారంటూ ట్రంప్ అభినందించారు. అమెరికా భూభాగమైన గువామ్ ద్వీపంపై దాడి చేస్తామని గతవారం ఉత్తర కొరియా తీవ్ర హెచ్చరికలు చేయడంతో ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డిన విషయం తెలిసిందే.

అయితే క్షిపణి దాడి విషయంలో ఉత్తర కొరియా వెనక్కి తగ్గింది. క్షిపణి ప్రయోగాన్ని వాయిదా వేస్తున్నామని, అమెరికా మరిన్ని నిర్లక్ష్య చర్యలు చేపట్టేంతవరకు వరకు ఎదురు చూస్తామని ఉత్తర కొరియా మీడియా పేర్కొంది. ఉత్తర కొరియా నిర్ణయంపై స్పందించిన ట్రంప్... కిమ్ తెలివైన నిర్ణయం తీసుకున్నారని పొగడటమే కాకుండా... క్షిపణి దాడి ఆలోచన విపత్కరమే గాక, ఆమోదయోగ్యం కానిది కూడా అని ట్వీట్ చేశారు. దాంతో అమెరికా, ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు కాస్త సద్దుమణిగాయి.

# ప్రియాంక చోప్రా ఇండియాకు రావద్దు..!



న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టు సోషల్‌మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. ప్రియాంక వస్త్రధారణపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. భారత్‌కు తిరిగి రావద్దంటూ.. అమెరికాలోనే ఉండిపొమ్మని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం రోజున జీన్స్, టీషర్ట్ ధరించిన ప్రియాంక.. జాతీయ జెండా రంగులతో ఉన్న ఒక దుప్పట్టాన్ని మెడపై వేసుకొని దానిని చేతితో పట్టుకొని ఫొటో దిగింది. దానిని ఇన్ స్టాగ్రామ్ లో మై హార్ట్ బిలాంగ్స్ టూ ఇండియా హ్యాష్ ట్యాగ్ తో పోస్టు చేసింది. అయితే ఆమె పెట్టిన పోస్టుపై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజైనా, చీర, సల్వార్ కమీజ్ వేసుకోకుండా ఇలాంటి డ్రస్‌లు ఏంటని కామెంట్ చేశారు. తనను తిరిగి ఇండియాలోకి రావద్దంటూ మండిపడ్డారు. జాతీయ జెండాను అవమానించే విధంగా దుపట్టాలా కప్పుకుంటావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రియాంక దుస్తులపై నెటిజన్లు విరుచుకుపడటం కొత్తేంకాదు. భారత ప్రధాని నరేంద్రమోదీ బెర్లిన్ పర్యటనలో ఉన్నప్పుడు మోకాళ్ల వరకూ ఉన్న డ్రస్ ధరించి కాలుపై కాలు వేసుకొని ఉన్న ఫొటోపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రియాంక హాలీవుడ్ సినిమా షటింగ్ లో భాగంగా అమెరికాలో ఉన్నారు.

# ఎంఎస్ ధోని క్రికెట్ అకాడమీ!



న్యూఢిల్లీ:భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని పలువురు మాజీ ఆటగాళ్ల బాటలో నడవబోతున్నాడు. ఓ క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేసి తర్వాతి తరానికి క్రికెట్ పాఠాలు నేర్పేందుకు సిద్ధమవుతున్నాడు. అయితే ధోని క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయబోయేది భారత్ లో కాదు.. దుబాయ్ లో.

ఈ విషయాన్ని దుబాయ్ పసిఫిక్ స్పోర్ట్స్ క్లబ్(పీఎస్‌సీ) వెల్లడించింది. దుబాయ్ లో 'ఎంఎస్ ధోని ధోని క్రికెట్ అకాడమీ'పేరుతో అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు పీఎస్‌సీ ప్రతినిధి పర్వేజ్ ఖాన్ తెలిపారు. దీనికి ధోని అంబాసిడర్ గా వ్యవహరించడమే కాకుండా తరచు అకాడమీను సందర్శిస్తూ ఉంటారన్నారు. ధోనితో కలిసి పనిచేస్తుండటం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ అకాడమీ కోసం ధోని సెప్టెంబర్ లో దుబాయ్ కి వెళ్లే అవకాశం ఉంది. యూఏఈతో పాటు ఇతర జీసీసీ దేశాలు, దక్షిణాఫ్రికా, యూకేల్లో ఎంఎస్ ధోని అకాడమీలపై తమకే పూర్తి హక్కులున్నాయని పీఎస్‌సీ స్పష్టం చేసింది.

# ఇన్ఫోసిస్ షేర్లకు బైబ్యాకు జోరు

టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ షేర్లు ట్రేడింగ్‌లో దూసుకుపోతున్నాయి. ఇంట్రాడేలో ఇన్ఫోసిస్ షేర్లు 4.63 శాతం మేర పైకి ఎగిసి, రూ.1,020.25 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదుచేశాయి. ఆగస్టు 19(శనివారం) షేరు బై బ్యాకు ప్రతిపాదనపై కంపెనీ బోర్డు సమావేశం కాబోతుందని ఇన్ఫీ తెలిపిన నేపథ్యంలో షేర్ల జోరు ఊపందుకుంది. "ఇన్ఫోసిస్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు కంపెనీ ఈక్విటీ షేర్లు బైబ్యాకు ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ మేరకు 2017 ఆగస్టు 19న సమావేశం ఏర్పాటుచేస్తున్నాం" అని ఇన్ఫోసిస్ బొంబై స్టాక్ ఎక్స్ఛేంజీకి ప్రకటన విడుదల చేసింది. ఆటోమేషన్, కొన్ని దేశాల్లో వీసా నిబంధనల కఠినతరంతో ఐటీ కంపెనీల కోర్ బిజినెస్‌ల వృద్ధి నెమ్మదించింది. ఈ నేపథ్యంలో ఐటీ కంపెనీలు ఒత్తిడిలో కొనసాగుతున్నాయి. 2017 జూన్ 30 నాటికి ఇన్ఫోసిస్ వద్ద లిక్విడ్ అసెట్స్(నగదు, స్వల్పకాలిక పెట్టుబడులు) రూ.39వేల కోట్లకు పైగా ఉన్నాయి. ఐటీ కంపెనీల వద్ద నగదు నిల్వలు మంచిగా ఉండటంతో, వాటిని షేర్ హోల్డర్స్‌కు పంచాలని బాగా ఒత్తిడి పెరుగుతోంది.

ఇటీవల ఐటీ అవుట్‌సోర్సింగ్ కంపెనీల్లో అతిపెద్ద దిగ్గజం టీసీఎస్ కూడా షేర్ బైబ్యాక్స్‌ను ప్రకటించింది. రూ.16,000 కోట్ల షేరు బైబ్యాకును ఈ ఏడాది మేలో పూర్తిచేసింది.

విప్రో కూడా గత నెలలో రూ.11,000 కోట్ల బైబ్యాకును చేపట్టనున్నట్టు తెలిపింది. ప్రస్తుతం 4.50 శాతం పైగా పెరిగి రూ.1,020 వద్ద ట్రేడవుతున్నాయి.

# కవి సమయం

## 'సృష్టి శోకం'

వారి పరిపాలన అలానే ఉంటుంది
మార్పులు - చేర్పులుండవు
వారి పరిపాలనలో...హాని చెయ్యని జంతువేది?
హాని పొందని జంతువేది?
ఈశ్వరుని ఆజ్ఞ లేనిదే
చీమైనా కుట్టదందురు ...వారి
పూర్తిగా చావనివ్వరు
పూర్తిగా బ్రతకనివ్వరు
చావూ-పుట్టుకలేని
స్వర్గసీమలో ఉంచనివ్వరు
ఎండలకు-వానలకు ప్రాణాలు
అల్లకల్లోలం జేయుచుందురు ...వారి
అడవుల్లో జంతువులను ఆకలి అనే
ఆవేదన సృష్టించి ఒక జంతువుని
ఇంకొక్క జంతువు బలి తీసుకొనునట్లు చేతురు
బాహ్య ప్రపంచంలో మనుష్యులను ఆకలిని, కోరికలను
సృష్టించి ఒకర్ని-ఒకరు మోసం చేయునట్లు చేతురు
నీటిలో జలచరములను ఆకలి సృష్టించి
ఒకదానిని ఒకటి చక్షించినట్లు చేతురు ...॥వారి॥
జీవి చస్తే కాల్చి బూడిద చేయుటకన్నా!
జీవి చస్తే భూమిలో పాతి మట్టి చేయుటకన్నా!
ఒక జంతువు కాహార్యం అగుట మిన్నయని
ఆ, భగవంతుడు జంతువులను అలా చేస్తున్నాడు కాబోలు ...వారి
నీ ఆకలికి వేరే జంతువో! వృక్షమో! కావాలిగదా!
మరి ఆ జంతువు ఆకలికి నువ్వో! ఇంకొక్క జంతువో!
కావాలిగదా!
నువ్వు-నీలాంటి వాళ్లు చిరంజీవిగా భువిపై ఉంటే
రాబోయే తరంవారి గతి భువిపై ఏది?
అందుకే
నీ వ్రాత వ్రాసింది ఒకరు
నీచే చేతలు చేయించింది ఒకరు
నీ కాలం మూడిందని ప్రాణం తీసుకుపోయింది ఒకరు ...॥వారి॥
నన్ను పుట్టించమన్నానా!
నన్ను చంపమన్నానా!
మధ్యన కన్ను నానా పాట్లు పెట్టమన్నానా!
అని గోడు పెట్టుకున్నా! ఆలకించరే- కన్పించరే
ఏ రాయినో! పుట్టనో! చెట్టునో! చెప్పుకోవాలే తప్పా!
ఇక స్ట్రయిక్‌లు, సమ్మెలు - ఏం చెయ్యగలరు ...॥వారి॥

... కవితా రచన
యల్.సిద్ధు
సెల్ నెం:7702977293

# పంచాంగం

మాసం : శ్రావణ : తిథి : ఏకాదశి ఉ.8.32; ఆరుద్ర రా.8.52; ఉ.వ.6.19ల 7.49

శుక్రవారం 18-08-2017

**మేషం** : వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం ఆర్థిస్తారు. **వృషభం** : వ్యవసాయ, ఎగుమతి, దిగుమ తులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు. **మిథునం** : స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం. **కర్కాటకం** : రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం** : కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య** : బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **తుల** :మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. **వృశ్చికం** : క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకు తగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, **ధనుస్సు** : ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం. **కుంభం** : మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. **మీనం** :నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం.

# ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!



శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించుకోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగన్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

# చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి : డా ప్రశాంతి



కాకినాడ రూరల్ : ఎంఆర్ వ్యాక్సిన్ ప్రతి తల్లి దండ్రుల తమ పిల్లలకు తప్పని సరిగా వేయించాలని కాకినాడ రూరల్ మండలం తూరంగి పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం 8పాఠశాలలో సుమారు 1327 మంది పిల్లలకు తట్టు రుబెల్లా వ్యాక్సిన్ వేసినట్లు ఆమె తెలిపారు. కొవ్వాడ చాణుక్య పాఠశాలలో సుమారు 350 మంది విద్యార్థులకు కరస్పాండెంట్ సత్య ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో ఈ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పివి. ప్రకాష్‌రావు, హెల్త్ సూపర్ వైజర్ జె.శంకర్, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీధర్ ,ఆరోగ్యకార్యకర్తలు, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ గృహ నిర్మాణం ద్వారా
## పేదలకు గృహాలు : ఎమ్మెల్యే అనంతలక్ష్మి



కాకినాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని పేదలందరికీ పక్కా గృహాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణలు పేర్కొన్నారు.గురువారం పండూరు గ్రామంలో ఎన్టీఆర్ గృహన్మిణ పథకం ద్వారా ఇండ్లు లేని 300మందికి ఇళ్ళ పట్టాలు మంజూరు చేసి ,భూమి పూజ చేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతీ గ్రామంలో కనీస మౌళిక సదుపాయాలు కల్పించడానికి కృషిచేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే కాకినాడ రూరల్ గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. గృహనిర్మాణాల కోసంరూ. 7కోట్ల 55లక్షలు ఖర్చుచేయడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాలలో రోడ్లు , డ్రైన్లు, తాగునీటి సౌకర్యం,మరుగుదొడ్లు, ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పండూరి శ్రీను,వివి వెంకటేశ్వరరావు, హౌసింగ్ డిఇ నాగమణి,హౌసింగ్ అధికారులు, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తట్టు మరియు రుబెల్లా టీకా వేక్సినేషన్
## అన్ని పాఠశాలలో తప్పనిసరిగా వేయించాలి

**పాఠశాలల యాజమాన్యం వైద్య ఆరోగ్య సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలిగించరాదు**
**- జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్**



విశాఖపట్నం: తట్టు మరియు రుబెల్లా టీకా కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లాలో నిర్ధేశించిన లక్ష్యాలను సాధించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో వైద్య, విద్య, మహిళా శిశు సంక్షేమ అధికారులతో జిల్లాలో అమలు జరుగుతున్న వేక్సినేషన్ క్యాంపెయిన్ పై సమీక్షించారు. అన్ని పాఠశాలలో 9 నెలల నుండి 15 సంవత్సరాల లోపు విద్యార్థులందరికి తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్‌ను వేయించాలన్నారు. విద్యార్థులకు వేక్సినేషన్ వేయించడానికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని అన్ని పాఠశాలల యాజమాన్యాలను కలెక్టర్ కోరారు.

## దళితులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలి



గాజువాక: దళితులను కించపరుస్తూ మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని బాబు జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అషోసియోషన్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం పెదగంట్యాడ న్యూపోర్టుపోలీస్‌స్టేషన్ లాఅండ్ ఆర్డర్ సి.ఐ. ని కలిసి వినతి పత్రాన్ని అందజేసారు.

ఈ సందర్భంగా అషోసియోషన్ ప్రతినిధులు మాట్లా డుతూ స్వాతంత్ర్యం వచ్చి 71వ సంవత్సరాలు అవుతున్న ఎస్సీఎస్టీ శుభ్రంగా వుండడరని, చదువులేనివారిని, అవగాహన లేనివారంటూ కించ పరుస్తూ రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమని అటువంటి మాటలను మాట్లాడిన రాష్ట్రమంత్రిని తక్షణమే అరెస్టు చేయాలని, ఆయన పై ఎస్సీఎస్టీ ఎట్రసిటీ కేసు నమోదు చేయాలని, చట్ట పరమైన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేసారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డా.బి.ఆర్.అంబేద్కర్, కాంగ్రేస్ ప్రభుత్వంతో 7సార్లు కేంద్ర మంత్రి పదవులు పొందిన బాబుజగ్‌జీవన్‌రామ్, ప్రస్తుతం భారతదేశానికి రాష్ట్రపతిగా వ్యవ హరిస్తున్న కోవింద్ కూడా దళిత వర్గానికి చెందిన వారనేది గుర్తించుకోవాలని అన్నారు.

ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళ వలసినదిగా కోరుతూ వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని సి.ఐ ని కలిసిన వారిలో బాబు జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అషోసియోషన్ ప్రతినిధులు మర్డపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, యం.సింహా చలం, కె.పెంటారావు, తదితరులున్నారు.

## సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పరవాడ: పరవాడ మండలము గోర్లివాని పాలెం గ్రామంలో గల సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరము ఆలయదర్శకర్త గంగాధర్ రావు ,అర్చకులు మూర్తి మాట్లడతూ శ్రావణ శుక్రవారంలో నేడుచివర శుక్రవారంకాబట్టిప్రత్యేక కుంకుమ పూజలు నిర్వర్తిసాముని అన్నారు భక్తులు అందురు తప్పనిసరిగా ఈ పూజలో పాల్గోని బాబా కృపకు పాత్రులు కావల్సినది గా కోరుచున్నారు.

## కృష్ణుని వేడుకులకు హాజరైన ఆధీప్‌రాజ్



పరవాడ : పరవాడ మండలము బొట్టవాని పాలెం గ్రామంలో జరుగుచున్న శ్రీకృష్ణుని వేడుకులకు గురువారం ముఖ్యఅతిథిగా వైఎస్ అర్‌సిపి పెందుర్తి నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ అన్నంరెడ్డి ఆధీప్‌రాజ్, సిఇసి మెంబర్ పైల శ్రీనువాసురావు, పరవాడ సర్పంచ్ చుక్క రాము నాయుడు హాజరై శ్రీ కృష్ణుని దర్శించుకున్నారు. అనంతరము అయన కార్యకర్తలతో మాట్లాడుతూ రానున్న రాజ్యం జగన్ అన్న రాజ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్అర్‌సీపీ పరవాడ మండలము యూత్ అధ్యక్షులు పెదిశెట్టి శేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### భూలోకమాంబ ఆలయానికి
## ముఖద్వారం ఏర్పాటు

**హాజరైన పరవాడ సర్పంచ్, ఎంపీటీసీలు**

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో గల భూలోకమాంబ ఆలయానికి గురువారం పరవాడ సర్పంచ్ చుక్క రామునాయుడు, పరవాడ ఎమ్‌పి టిసిలు పైల శ్రీనువాసురావు, సిరపూరపు అప్పల నాయుడు చేతులు మీదగా ఆలయ ముఖద్వారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పైల పోతి నాయుడు (పెద్దింటి) పైల రమణబాబు, పోతల అప్పల నాయుడు, పైల హరేష్, బండారు రామా రావు తదితరులు పాల్గొన్నారు.



## కనిపించుటలేదు



సింహాచలం: గ్రేటర్ విశాఖ 72వ వార్డు, జంగాల కాలనికి చెందిన కరణం ప్రసాద్ (48) అదృశ్యం అయ్యారని ఆయన భార్య కుమారి గోపాలపట్నం పోలిస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం అయిన ప్రసాద్ 28 మే 2017న ఇంటినుండీ బయటకు వెళ్లిన ఆయన ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదని అతని భార్య పోలీస్ లకు ఫిర్యాదు చేశారు. మే నెల నుండి కనిపించక పోతే ఇంతవరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రసాద్ భార్య కుమారిని పోలీస్ లు ప్రశ్నించారు. అందుకు ఆమె సమాధానం చెబుతూ ఆయన అప్పుడప్పుడు పెయింటింగ్ పనికి బయటకు వెళ్లి 2నెలల కొకసారి ఇంటికి వచ్చేవారని, అలాగే అనుకుని ఇన్నాళ్ళు ఆయన కోసం ఎదురుచూసి వేరే గత్యంతరం లేక పోలీస్ లకు ఫిర్యాదు చేశామన్నారు. గోపాలపట్నం పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వైకుంఠరావు తెలిపారు.



## కానిస్టేబుల్ నుంచి రక్షణ కల్పించండి

విశాఖక్రైం : నగరంలోని ఐదవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ తట్ట శంకరరావు నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ తాటిచెట్లపాలెంనకు చెందిన ఉంగరాడ అప్పలనాయుడు నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు అప్పలనాయుడు మాట్లాడుతూ తన భార్య జ్యోతికి అన్న వరసైన కానిస్టేబుట్ శంకరరావుతో సన్నిహితంగా వుండేదన్నారు. తర్వాత జరిగిన పరిణామాలతో వారిని నిలదీసినట్లు చెప్పారు. ఈ విషయాలను ఎవరికైనా చెప్పావంటే ఏదైనా కేసులో ఇరికించి జైలులో పెట్టిస్తామని వారిద్దరూ తనను బెదిరిస్తున్నారని అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.


# సత్యదేవుని చెంత ఆకలి చింత



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం సత్యదేవుని సన్నిధికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తారు. భక్తులు ఎక్కువగా స్వామివారి వ్రతాలు ఆచరిస్తే భక్తుల మనసులో ఉన్న కోర్కెలు తీరుతాయనేది ఇక్కడ భక్తుల నమ్మకం.అందులోనూ విశేషమైన వివాహ మూహుర్తం కావడం వలన అధిక సంఖ్యలో గురువారం భక్తులు రత్నగిరికి తరలి వచ్చారు.కొత్తగా పెళ్ళి అయిన జంట ఈ సత్యదేవుని వ్రతం ఆచరిస్తే చక్కటి సౌతానం కలగి సుఖ సంతోషములతో ఉంటారని భక్తుల నమ్మకం.ఆ వ్రతము కను ఉదయం ఏమీ తినకుండా వ్రతం ఆచరిస్తే ఎక్కువ ఫలితం కలుగుతుంది. అయితే భక్తులు ఉపవాసంతో సుమారు రెండు గంటల సేపు కుర్చుని వ్రతం ఆచరిస్తారు.వ్రతం ఆచరించిన అనంతరం శ్రీ స్వామివారి దర్శనము పూర్తి చేసుకొని వచ్చే సరికి భక్తులు ఆకలితో సతమతమవుతూ ఉంటారు.అయితే ఆగలితో ఉన్న భక్తజనం టల్ కి వెళ్ళదాము అనుకొనేసరికి దేవస్థానం మొత్తం మీద ఒక్కటే క్యాంటీన్ ఉండటం వలన అందులో జనం సరిపోక పోయేసరికి భక్తులు శ్రీ స్వామివారి నిత్య అన్నదానంపై ఆదారపడతారు.అయితే దేవాదాయశాఖ వారి ఆదేశాల ప్రకారము ప్రతీ దేవస్థానంలోను నిత్యం ఐదు వేల మందికి భోజనము పెట్టాలని ఆదేశాల ద్వారా తెలిపారు.అయితే ఈ అన్నవరం దేవస్థానంలో మాత్రము ఉదయం10-30 ని.ల నుండి మధ్యాహ్నము 2.30 ని॥ల వరకు భోజనాలు పెట్టుచున్నారు.అయితే ఇక్కడ అన్నదానం భవనం సరిపోక భక్తులు ఇబ్బంది పడుచున్నారు.ఒక భక్తుడు భోజనము చేయాలి అంటే సుమారు రెండుగంటల సేపు క్యూ లైనులో నిలబడే పరిస్దితి అలాగే అన్నదానం భవనంలోకి వెళ్లే క్యూ లైన్లు సరిపోక భక్తులు ఇబ్బందులకు గురి అవుచున్నారు.కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి భక్తులకు ఈ సమస్యపై దృష్టి పెడతారని భక్తులు కోరుచున్నారు.

# పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

**- రహదారులు, భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు



ఎన్టీఆర్‌గృహాల మంజూరు పత్రాలను అందిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం ; రాష్ట్రంలోని అన్ని గ్రామాలను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం మాకవరపాలెంలో తాళ్లపాలెం-నర్సీపట్నం రహదారికి శంకు స్థాపన చేసారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.33కోట్ల వ్యయంతో 2200 ఎన్టీఆర్ ఇళ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకున్నా మన్నారు. మాకవరపాలెం మండలంలో దాదాపు 920 ఇళ్లు అందించామన్నారు. పోలవరం కుడికాలువ నుంచి సాగునీరును చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, కశింకోట తదితర మండలాల్లో గల భూములకు అందించేందుకు కశింకోట మండలం జమ్మాదులపాలెం వద్ద లిఫ్ట్ ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు, చంద్రన్న భీమా లబ్ధిదారులకు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంఎల్ఏ పీలా గోవింద సత్యన్నారాయణ, ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ మూర్తి, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నర్సీపట్నం ఆర్డీఓ సూర్యారావు, మాకవరపాలెం ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, జడ్పీటీసీ కసిపల్లి కుమారి, తెలుగుదేశం పార్టీ నాయకులు శేషుకుమార్, సూర్యనారాయణ, అల్లు రామునాయుడు, వెంకటరమణ(గోవింద), పోతల అప్పల నాయుడు, తహసీల్దార్ రమామణి, ఎంపీడీఓ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రుల పందిరరాటకు మహూర్తం



యానాం : ఈ నెల 25 నుండి గణపతి నవరాత్రుల మహోత్సవానికి తిల్లారాయి దేవాలయంలో పందిరరాట మహోర్తాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ కాపుగంటి ఉమాశంకర్ నిర్వహించారు. గురువారం ఉదయం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో పందిర రాటకు మహోర్తం చేసారు. ఈ నెల 25 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు గణపతి నవరాత్రుల మహోత్సవ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. 26న హంస వాహనం, 27న మయూరి వాహనం, 28న మూషికవాహనం, 29న నంది వాహనం, 30 శేషవాహనం, 31న సింహ వాహనం, 1న డోలోత్సవం మరియు పుష్పక వాహనం, 2న రాధోత్సవం, 3న తెప్పోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 4వ తేదీన గణపతి విగ్రహ నిమజ్జనంతో నవరాత్రల మహోత్సం ముగిస్తా యన్నారు. ఈ గణపతి మహోత్సవంలో భక్తులు అందరూ పాల్గొని జయప్రదం చేయా లని కోరారు. ఈ కార్యక్రమం లో కోశాధికారి ఆదా వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, అర్చకలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర టీడీపీ ఎస్సీ కమిటీ నాయకుడు గంట్యాడ శంకరరావు నివాసంలో

# విలేకరుల సమావేశం



విశాఖపట్నం : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ కమిటీ నాయకుడు గంట్యాడ శంకరరావు తన నివాస కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో మాట్లాడుతున్న తీరును విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఉపాధి సంక్షేమ పథకాలును చూసి ఓర్వలేక ఉప ఎన్నికల్లో ఓడిపోతమనే భయంతో జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై లేనిపోని విమర్శలుచేస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి అతనిపై దాడిచేస్తే అప్పుడు అతనిపై జాలికలుగుతుందని ఆయన ఆలోచనని, కానీ ఇలాంటి వారిని చంద్రబాబునాయుడు ఎంతో మందిని చూశారన్నారు. 2019 ఎన్నికలలో ప్రతిపక్షహోదాకూడా పోతుందేమోనని జగన్ బుర్రపట్టుకుంటున్నాడన్నారు. చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలు చాలా వరకు నెరవేర్చారని మిగిలినవి కూడా 2018 లోగా నెరవేరుస్తారని ఇది ప్రజలలోకి వెళ్ళి తెలుసు కొవాలన్నారు.

ఈ సమావేశంలో ఎస్సీ నాయకు లు వంకర ఆనంద్, పెద్దాడ పైడిరాజు, మక్కి రామకృష్ణ, బంగారు రవిశంకర్, ఇ. ప్రసాద్, జి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అవసరం మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలి





ఆలమూరు : రైతులు తమ పంట పొలాల్లో అవసరం మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.ఎస్.వి. ప్రసాద్ అన్నారు. మండల పరిధి పినపళ్ల వరి పంట పొలాలను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడుతూ పంటపై వ్యాపిస్తున్న శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తిని గమనించి తదనుగుణంగా పురుగు మందులను పిచికారి చేయాలని అన్నారు. వారం రోజులలో ఎలుకల నివారణకు క్రోమోడయోలిన్ మందును పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.డి.ఎ. సిహెచ్.కె.వి.చౌదరి, ఏఓ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ పరిజ్ఞానంపై రైతులకు బ్యాలెట్ పరీక్షలు : మండల పరిధి పినపళ్ల గ్రామంలో గురువారం నిర్వహించబడిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ విషయ పరిజ్ఞానం తెలుసుకోవడానికి మండల వ్యవసాయాధికారి కె.వి.ఎన్.రమేష్ కుమార్ బ్యాలెట్ బాక్స్ పరీక్షలు నిర్వహించారు. 30 మంది రైతులు వ్యవసాయంపై వారికి ఎంతవరకు అవగాహన వుందో తెలుసుకోవడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఏఓ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఈఓ సిహెచ్. భువనేశ్వరి, ఎంపిఈఓలు మనోహర్, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

# ఉరేసుకొని ఉద్యోగి ఆత్మహత్య

యానాం : కుటుంబ కలతలకు మనస్తాపానికి గురై ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రజాపనుల శాఖ ఎన్ఎంఆర్ ఉద్యోగి దరియాల తిప్ప నివాసి రొక్కం చంటిబాబు (35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు గురువారం ఉదయం ఇద్దరు ఆడపిల్లలను స్కూల్‌కు పంపిన తరువాత ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు భార్య గల్ఫ్ దేశంలో ఉండగా ఇద్దరు పిల్లలుతో జీవం సాగిస్తున్నాడు. కుటుంబ భారంలో అప్పులు పాలవ్వడం, భార్య నగదు పంపకపోవడం, మరోపక్క ప్రజాపనుల శాఖలో ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం, కుటుంబ భారం తానే మోయడంతో మానసిక వేదనకు గురై ఈ అగత్యానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృత దేహాన్ని పోలీసులు యానాం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గల్ఫ్ దేశం నుండి భార్య వచ్చేంతవరకు మార్చురిలో భద్రపరుస్తామని పోలీసులు తెలిపారు. ఆమె వచ్చిన తరువాత పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ వి. శివకుమార్ తెలిపారు.

## నిర్లక్ష్యం వదలండి నిబంధనలు పాటించండి ప్రాణాలు కాపాడండి

పెద్దాపురం : వాహనాలు నడపడంలో నిబంధనలు పాటించకపోవడంవలన మద్యపానం సేవించి వాహనాలు నడపడంవలన ప్రాణాలు కోల్పోతున్నారని పెద్దాపురం ఎస్ఐ కృష్ణభగవాన్ అన్నారు. వాహనాల వినియోగం పెరిగిపోవడంతో ప్రమాదాలు కూడా పెరిగాయన్నారు. లైసెన్స్ లేకపోవడం, త్రిబుల్‌రైడింగ్, చిన్న పిల్లలు వాహనాలు నడపడం, మద్యపానం సేవించడం, డ్రైవింగ్ సమయాల్లో సెల్‌ఫోన్లు మాట్లాడడం, అతివేగం ప్రమాదాలకు కారణం అన్నారు. ముఖ్యంగా మద్యపానం సేవించి డ్రైవింగ్ వలన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. వాహనదారులు నిర్లక్ష్యం వదిలి నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని ఎస్ఐ కృష్ణభగవాన్ కోరారు.

## నేడే సామూహిక శ్రావణ శుక్రవారం వ్రతం

ఆలమూరు : అనాదిగా హిందూ స్త్రీలు నిర్వహించుకునే విశేషమైన వ్రతం శ్రీ వరలక్ష్మీ వ్రతం. ఈ వ్రతం చేసుకునే అవకాశం స్త్రీలందరికీ కల్పించాలనే ఉద్దేశ్యంతో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆలోచన నేపధ్యంలో ఈ నెల 18వ తేదీ శుక్రవారం స్థానిక శ్రీ జనార్ధనస్వామి వారి దేవస్థానంలో నిర్వహించబడుచున్నట్లు కార్యనిర్వహణాధికారి సిహెచ్. సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన మహిళలు తమపేర్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయంలో నమోదు చేసుకొన వలసినదిగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, ఉచితంగా నిర్వహించబడునని ఆయన తెలిపారు.

## ఘనంగా జగన్నాథరెడ్డి జన్మదిన వేడుకలు

రావులపాలెం : రావులపాలెం గ్రామ పంచాయితీకి ఎనలేని కృషి చేస్తూ నిరంతర సేవాపరుడుగా పేరుగాంచిన ఉప సర్పంచ్ కొవ్వూరి జగన్నాథరెడ్డి జన్మదిన వేడుకలు గురువారం గ్రామ పంచాయితీ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా జగన్నాథరెడ్డి మాట్లాడుతూ తనకు ఓపిక ఉన్నంతవరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని, తన గ్రామం కోసం ఎన్నడూ పాటు పడుతూ, గ్రామాభివృద్ధికి ఇదే విధంగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం పంచాయితీ వద్ద సిబ్బందికి దుస్తులు, పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భముగా నియోజక వర్గంలోని పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు

## ఉచిత మెగా వైద్య శిబిరం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం హస్పటల్ నందు గురువారం ఉచిత మెగా వైద్య శిబిరము నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డా. లక్ష్మి గా గ్రామంలోని స్త్రీలకు మరియు హైస్కూల్, కాలేజీ పిల్లలను పరీక్షించి ఉచితముగా మందులు పంపిణీ చేసారు.



విశాఖపట్నం సిటీ పోలీసు లోగో రూపొందించేందుకు జరిగిన పోటీల్లో ఎంతోమంది చురుకుగా పాల్గొని వివిధ లోగోలను రూపొందించారు. విశాఖసిటీ స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ కె. శ్రీనివాసరావు కుమారుడు కె. క్రాంతి స్వరూప్ ఇందులో విజేతగా నిలిచాడు. విజేతకు విశాఖ సిటీ పోలీసుకమీషనర్ టి. యోగానంద్ రూ. 20,000/-లు నగదు బహుమతిగా అందచేశారు. కె. క్రాంతిస్వరూప్ సిటీ పోలీసు స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఉద్యోగి కుమారుడు కావడం పోలీసుశాఖ ఎంతో గర్వించదగ్గ విషయం.

# 18న ఉప్పులూరి గణపతిశాస్త్ర వేదపరిషత్ సభలు

కాకినాడ : వేదవిజ్ఞాన ప్రతిష్టానమ్ భవన ప్రాంగణంలో ఈనెల 18న ఉప్పులూరి గణపతి శాస్త్రి 35వ వార్షిక వేదశాస్త్ర పండితుల సమావేశం బ్రహ్మశ్రీ దువ్వూరి సర్వేశ్వర ఘనాపాఠి ఆధ్వర్యంలో జరుగుతుందని పరిషత్ కార్యదర్శి రాయప్రోలు ప్రసాదశర్మ తెలిపారు. స్థానిక రామారావుపేటలో ఉన్న వేదవిజ్ఞాన ప్రతిష్ఠాన కార్యాలయ ప్రాంగణంలో ఈ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని కాకినాడ జగన్నాథపురం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ధూళిపాక సూర్యభగవాన్ దంపతుల చే 16మంది వేద శాస్త్రపండితులకు నూతన వస్త్రాలతో సత్కరించడం జరుగుతుందని చెప్పారు. సమావేశానికి పరిషత్ అధ్యక్షులు శ్రీపాద రాజశేఖర శర్మ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. 2016-17 సంవత్సరపు ఆదాయవ్యయ వివరాలను పండితుల సమక్షంలో వివరించడం జరుగుతుందని చెప్పారు. పండితులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

పరిషత్ ఉపాధ్యక్షులు చెరుకుపల్లి వెంకట లక్ష్మినృశింహ శర్మ, తనికెళ్ళ బుచ్చివెంకటశాస్త్రి, సహాయ క్యాదర్శులు మల్లాది వీరవెంకట సుబ్రహ్మణ్య శర్మ, కుప్పా లక్ష్మినర శింహమూర్తి, కోశాధికారి సుసర్ల ధర్మారావు, కార్యవర్గ సభ్యులు మోగంటి నాగజోగేశ్వర శర్మ, బ్రహ్మశ్రీ గరిమెళ్ళలక్ష్మినారాయణశర్మ, ఇంద్ర ˊగంటి భీమశంకరరావుచే పండిత సభ కార్యక్రమ నిర్వాహణా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. సమావేశ వివరాలకోసం 9849507205లో సంప్రదించాలిందిగా రాయప్రోలు ప్రసాదశర్మకోరారు.

## ఆలమూరులో కొనసాగుతున్న

# కాపుల వినూత్న నిరసనలు



ఆలమూరు : కాపులకు బి.సి. రిజర్వేషన్లు కల్పించాలని ముద్రగడ పద్మనాభం చేస్తున్న ఉద్యమానికి మద్ధతుగా మండలకేంద్రం ఆలమూరులో శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం మండలాధ్యక్షుడు వైయస్సార్‌సిపి రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకర రావు ఆధ్వర్యంలో ప్రతిరోజు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించు చున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వతంత్ర్య దినోత్సవం వేడుకలలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, చంద్రబాబు నాయుడు కాపులను బి.సి.లలో కలుపుతానని యిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ముద్రగడ శాంతియుత పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసారు. అలాగే 50మంది పారిశుద్య కార్మికులు, రిక్షా కార్మికులుకు నూతన వస్త్రములను అందజేసారు. ఇటీవల అమరావతిలో టిడిపి కాపు నేతలతో నిర్వహించిన సమవేశంలో చంద్రబాబు నాయుడు రిజర్వేషన్ల అంశంపై స్పష్టత ఇవ్వకుండా కాపుల చెవుల్లో పువ్వులు పెట్టారని విమర్శనల నేపథ్యంలో బుధవారం కాపు నాయకులు చెవుల్వో పువ్వులు పెట్టుకుని నిరసనలు తెలియజేసారు. అలాగే గురువారం మండల నాయకులు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో కాపు నాయకులు కాళ్ళకు, చేతులకు ఇనుప గొలుసులు కట్టుకుని నిరసన తెలియజేసారు.

ఈ కార్యక్రమాలలో శ్రీకృష్ణదేవరా య కాపు అభ్యుదయ సంఘం ఆలమూరు గ్రామ అధ్యక్షులు చల్లా సత్యనారాయణ (నానాజీ), కార్యదర్శి ఎలుగుబంట్ల సాయిబాబు, పురుషోత్తం వీర్రాజు, నామన దుర్గాప్రసాద్, చల్లా భూషణం, కోలా నాని, సుందర బూరయ్య, కొటికలపూడి నాని తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విమాన సర్వీసులతో పర్యాటక రంగానికి మహర్ధశ



యానాం : దేశంలోనే పుదుచ్చేరి ప్రధాన పర్యాటక కేంద్రంగా విలసిల్లడానికి విమాన సర్వీసులు ప్రారంభంతో మహర్ధశ పట్టనున్నది. ఇప్పటివరకు పుదుచ్చేరిని పర్యాటకంగా తిలకించేందుకు లక్షలాది పర్యాటకు చెన్నై వరకు విమానంలోని, ట్రైన్‌లలో వచ్చి అక్కడ నుండి రోడ్డు మార్గంలో 180 కిలోమీటర్లు ప్రయాణం చేసేవారు. పుదుచ్చేరి పర్యాటక అందాలు తిలకించేందుకు అనునిత్యం వేలాదిమంది తరలివెళడం పరిపాటిగా వస్తుంది ఎడాదికి సుమారు 13 లక్షల మంది పర్యాటకులు వీక్షిస్తున్నట్లు ఆదారాలు ఉన్నాయి. ఫ్రాన్స్, పారిస్, ఇతర దేశాల నుండి పర్యాటకులు అధిక సంఖ్యలో పుదుచ్చేరి చేరుకొని నెలల తరబడి పర్యాటక అందాలను తిలకిస్తుంటారు. ఈ నెల 16న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక గజపతిరాజు ఆదేశాల మేరకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణసామి, పౌరవిమానయాన శాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావుల కృషివలన స్పేస్‌జెట్ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఈ విమానాల ప్రారంభంతో పర్యాటకులు గంటన్నరలో ఇతర ప్రాంతాల నుండి పుదుచ్చేరి చేరుకొనే వెసులుబాటు కలుగుతుంది. హైదరాబాద్ నుండి పుదుచ్చేరి వెళ్ళాలంటే రైలులో సుమారు 20 గంటల సమయం పడుతుంది. ఆదే విమానంలో రూ. 3500/- లకు గంటన్నరలో పుదుచ్చేరి వేళ్ళేఅవకాశం కలుగుతుంది విమానంలో 79 సీట్లకు గాను సగం మందికి ప్రయాణికులు ఉంటే మిగిలిన ప్రయాణికుల ఖర్చు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి. దీంతో తక్కువ సమయంలో విజయవాడ, హైదరాబాద్ నుండి పుదుచ్చేరి వెళ్ళే అవకాశాలు కలుగుతున్నాయి. అలాగే బెంగుళూరు, కొయ్యంబత్తురు. కేరళ, ముంబాయి పుదుచ్చేరి నుండి విమాన సర్వీసులు పునఃరుద్ధరించేందుకు పలు విమాన సర్వీసులు ముందుకు వస్తున్నాయిని అక్టోబర్‌లో ఇవి ప్రారంభమవుతాయని మంత్రి మల్లాడి తెలిపారు. ఈ విమాన సర్వీసులు పూర్తిస్థాయిలో జరిగితే పుదుచ్చేరికి పర్యాటకల తాకిడి అధికమవుతుందన్నారు. దీంతో పర్యాటక రంగం ద్వారా అనేక రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. పుదుచ్చేరి అభివృద్ధి పర్యాటక రంగంపై ఆదారపడి ఉందని పర్యాటకులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. విమాన సర్వీసులు ప్రారంభించడానికి కృషిచేసిన కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజుకు, ముఖ్యమంత్రి వి నారాయణసామికి, మంత్రులకు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# లయన్స్ ఎలైట్‌చే విద్యార్ధులకు బస్ పాస్‌లు



కాకినాడ : లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంనుండి కాకినాడకు వచ్చి చదువుకుంటున్న విద్యార్ధిని విద్యార్ధులకు బస్‌పాస్‌లను ఉచితంగా అందజేయడంపట్ల ఆర్.టి.సి. కాకినాడ డిపోమేనేజర్ భాస్కర్ హర్షాన్నివ్యక్తంచేసారు. స్థానిక లయన్స్ ఎలైట్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సామర్లకోట, పిఠాపురం, తాళ్ళరేవు, కరప, ఇంద్రపాలెం,పెదపూడి, ప్రాంతాలకుచెందిన 500మంది విద్యార్ధులకు 20వేలరూపాయలు విలువచేసే ఆర్.టి.సి. బస్‌పాస్‌లను లయన్స్ గవర్నర్ వర్మ, వైస్ గవర్నర్లు లింగమల్లు కృష్ణమూర్తి, సత్యన్నారాయణ, క్లబ్ వ్యవస్థాపకులు ముంజులూరి విశ్వేశ్వరరావు క్లబ్ అధ్యక్షులు అజ్జరపు మల్లిఖార్జునరావు, కార్యదర్శి కందుకూరి చంద్రమౌళీశ్వరశర్మ చేతులమీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా లయన్స్ గవర్నర్ వర్మ మాట్లాడుతూ విద్యార్ధులకు అవసరమైన బస్‌పాస్‌లను సకాలంలో అందించేందుకు లయన్స్ ఎలైట్ క్లబ్ తీసుకున్న చర్యలు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుతుందని చెప్పారు. ఇటువంటి సేవాకార్యక్రమాలు విద్యార్ధుల జీవితాలలో కొత్తమలుపు మరియు ఆలోచనను తీసుకురావడానికి ఎంతో అవకాశం ఉంటుందని అన్నారు. సేవా కార్యక్రమాలలో విద్యార్ధిని విద్యార్ధులను భాగస్వామ్యం చేయడంద్వారా భవిష్యత్‌లో సేవాకార్యక్రమం నిర్వహణకు ప్రతినిధులుగా నిలబడతారని ఆయన అన్నారు. ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆర్.టి.సి. అధికారుల విజ్ఞప్తిమేరకు క్లబ్ సభ్యుల సహకారంతో బస్‌పాస్‌లను అందజేసామని చెప్పారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో రానున్న తరానికి ప్రతినిధులైన విద్యార్ధిని విద్యార్ధులకు సేవాసంస్థలయొక్క కార్యక్రమాలను ఈ రూపంగా పరిచయంచేయడమే తమ లక్ష్యమన్నారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో జి. వేమవరం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలను దత్తత తీసుకొని విద్యార్ధులకు అవసరమైన లక్షరూపాయలు విలువచేసే క్రీడాపరికరాలను అందజేయడమేకాక ఆ పాఠశాలకు అవసరమైన బెంచీలనుకూడా అందజేసామని గుర్తుచేసారు. కార్యక్రమంలో జోన్‌ఛైర్‌పర్సన్ మండలీక వెంకట శాస్త్రి, ఆర్.టి.సి. అసిస్టెంట్ మేనేజర్ రమణ, ఆర్‌టిసి ప్రజసంబంధాల అధికారులు భోగిరెడ్డిరాము, బి.వి.ఎస్.ఎన్. రెడ్డితోపాటు శ్రీరామరాజు, ఆర్.పి.ఆర్.విఠల్, శ్యాప్ ఎ.డి. ఎస్.వి. రమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# చిత్రభాను



## భాగమతికి గుమ్మడికాయ!

బాహుబలి ది కన్‌క్లూజన్ తర్వాత కొత్త చిత్రాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నది అనుష్క. మహిళా ప్రధాన చిత్రాలు, విలక్షణ కథాంశాల వైపు మొగ్గుచూపుతున్నది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం భాగమతి. అశోక్.జి దర్శకత్వం వహిస్తున్నారు. యు.వి. క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయినట్లు నిర్మాతలు ప్రకటించారు. సినిమాకు సంబంధించిన మరిన్ని కొత్త విషయాల్ని త్వరలో వెల్లడిస్తామని ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. సూపర్ నేచురల్ టెక్నో థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆధునిక యువతిగా, శక్తివంతమైన మహిళగా అనుష్క పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగనున్నట్లు సమాచారం. దాదాపు యాభై కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆది పినిశెట్టి, ఉన్నిముకుందన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్ని సమకూర్చుతున్నారు. తెలుగుతో పాటు తమిళంలో ఏకకాలంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



## హీరోయిన్ ప్రియమణి పెళ్లి సందడి

సౌత్ బ్యూటీ ప్రియమణి పెళ్లి సందడి మొదలైంది. మరో వారంలో ఆమె తను కోరుకున్న ప్రియుడిని పెళ్లాడబోతోంది. ఆగస్టు 25న ప్రియమణి-ముస్తఫారాజ్ వివాహం జరుగబోతోంది. పెళ్లి వేడుక ప్రైవేట్ కార్యక్రమంగా జరుగబోతోంది. అయితే వెడ్డింగ్ రిసెప్షన్ సినీ ప్రముఖుల సమక్షంలో గ్రాండ్ గా జరుగబోతోంది. వెడ్డింగ్ సెర్మనీ మూడు రోజుల పాటు జరుగబోతోంది. మొహందీ, సంగీత్, కాక్ టెయిల్ పార్టీ, రిసెప్షన్ వేడుక ఒకదాని వెనక ఒకటి జరుగనున్నాయి. ఇప్పటికే సినిమాలకు వీలైనంత దూరంగా ఉంటున్న ప్రియమణి పెళ్లి తర్వాత పూర్తిగా సినిమాలు మానేస్తుందని సమాచారం. గత ఐదేళ్లుగా ప్రియమణి-ముస్తఫా రాజ్ ప్రేమించుకుంటున్నారు. ముస్తఫా రాజ్ ఈవెంట్ మేనేజ్మెంట్ బిజినెస్ రన్ చేస్తున్నారు. ఓసారి ఐపీఎల్ మ్యాచ్‌లో ముస్తఫా పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ముస్తఫా యాటిట్యూడ్, అతడి నిజాయితీ, సెన్సాఫ్ హ్యూమర్ నాకు బాగా నచ్చింది అందుకే అతని ప్రేమలో పడిపోయాను అని ప్రియమణి గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. 2016 మే 27వ తేదీన ప్రియమణి-ముస్తఫా రాజ్ ఎంగేజ్మెంట్ జరిగింది. ఎంగేజ్మెంట్ తర్వాత పెళ్లి కోసం సంవత్సరకంటే ఎక్కువ గ్యాప్ తీసుకున్నారు. ఈ ఐదేళ్ల పరిచయంలో ఎలాంటి విభేధాలు, మనస్పర్థలు లేకుండా వీరి రిలేషన్ కొనసాగుతుండటం విశేషం.

# మసాలా పెంచిన 'బిగ్ బాస్'



తెలుగు 'బిగ్ బాస్' షో రాను రాను ఆసక్తిలేకుండా సాగుతుందనే విమర్శలు రావడం, గత వారం రేటింగ్ కూడా కాస్త తగ్గడంతో షో నిర్వాహకులు రూటు మార్చారు. వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా నవదీప్‌ను రప్పించడంతో పాటు.... లగ్జరీ బడ్జెట్ టాస్క్‌లో మసాలా పెంచారు. బిగ్ బాస్ స్టార్ హోటల్ పేరుతో ప్రస్తుతం కొత్త టాస్క్ రన్ అవుతోంది. ఇందులో నవదీప్, దీక్ష గెస్టులుగా ఉండాలని, ఇతర బిగ్ బాస్ ఇంటి సభ్యులంతా హోటల్ సిబ్బందిగా ఉండాలని బిగ్ బాస్ ఆదేశించారు. ప్రిన్స్‌ను హోటల్ మేనేజర్‌గా, కార్తీక, హరితేజలను చెఫ్‌లుగా, ముమైత్ ఖాన్‌ను పర్సనల్ అసిస్టెంటుగా, శివ బాలాజీ, ఆదర్శ్, ధనరాజ్, అర్చన వెయిటర్లుగా నియమించారు.

అయితే నవదీప్, దీక్ష పంత్‌లను ప్రత్యేకంగా పిలిచిన బిగ్ బాస్.... హోటల్ సిబ్బంది చిరాకు పడేలా, తాము ఈ పనులు చేయము అనేలా వారిని విసిగించాలంటూ సీక్రెట్ టాస్క్ ఇచ్చారు. దీంతో ఆ ఇద్దరూ రెచ్చిపోయి ప్రవర్తించారు. హోటల్ సిబ్బందికి విసుగు తెప్పించడంలో భాగంగా నవదీప్ దారుణంగా ప్రవర్తించాడు. అర్చనను పిలిచి కాళ్లకు మసాజ్ చేయించుకున్నాడు. తాను అర్ధనగ్నంగా మారుతానని, థాయ్ మసాజ్ చేయాలని డిమాండ్ చేశాడు. తన కాలి బ్రొటన వేలుపై ఉన్న వెంట్రుకలను అర్చన తన పంటితో పీకాలని ఆదేశించాడు. అయితే తాను పంటితో మీ కాలి వెంట్రుకలను పీకలేనని అర్చన తేల్చి చెప్పింది. ఇక ధనరాజ్, ఆదర్శ్, శివ బాలాజీలలో ఎవరైనా అర్ధనగ్నంగా మారి తనకు సేవలు చేయాలని నవదీప్ కోరగా.... అందుకు తమ హోటల్ రూల్స్ ఒప్పుకోవని మేనేజర్ ప్రిన్స్ తేల్చి చెప్పారు. ఇయర్ బడ్స్ ఉపయోగిస్తే తన చెవి నొప్పి పుడుతుందని, అందుకు ఎవరైనా వచ్చి వారి నాలుకతో తన చెవి క్లీన్ చేయాలని నవదీప్ ఆదేశించాడు. ఇలా దారుణమైన కోరికలు కోరుతూ నవదీప్ హోటల్ సిబ్బందిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. నవదీప్ రేంజిలో కాక పోయినా.... దీక్ష ప్రవర్తన కూడా అదే స్థాయిలో సాగింది. శివ బాలాజీ, ధనరాజ్‌లతో మసాజ్





చేయించుకుంది. వారు ఒంటిపై బట్టలు లేకుండా కేవలం టవల్ మాత్రమే కట్టుకుని తనకు మసాజ్ చేయాలని కోరింది. శివ బాలాజీ, ధనరాజ్ మోకాళ్ల వరకు మసాజ్ చేస్తుంటే..... తన తొడలపై సైతం మసాజ్ చేయాలంటూ వారు ఇబ్బంది పడేలా ప్రవర్తించింది. అయితే గెస్టులు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా వారికి సేవలు చేస్తూ, వారు అడిగిన గొంతెమ్మ కోరికలు తీరుస్తూ.... వారు మెప్పు పొంది ఎక్కువ స్టార్ రేటింగ్ సాధిస్తేనే ఇంటి సభ్యులు ఈ టాస్క్‌లో గెలుపొందుతారు. వచ్చే వారం బిగ్ బాస్ ఎలిమినేషన్ నుండి సురక్షితులు కావాలంటే..... హోటల్ సిబ్బంది ఇబ్బంది పడేలా తాము ఈ పనులు చేయలేము అనే స్థాయికి వాళ్లను తీసుకెళ్లాలని బిగ్ బాస్ నవదీప్, దీక్షలకు సూచించారు. దీంతో ఎలిమినేషన్ నుండి సురక్షితులు అయ్యేందుకు హోటల్ సిబ్బంది వారి పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నారు.

# శవాన్ని లేపి మరీ చంపేస్తా!



మేరా నామ్ తేడా.. తేడా సింగ్.. దిమాక్ తోడ.. చాలా తేడా.. 36 దోపిడీలు.. 24 మర్డర్స్.. 36 స్టాపింగ్‌లు.. దిస్ ఈజ్ మై విజుబుల్ రికార్డు ఇన్ వికీపీడియా అంటున్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం పైసా వసూల్. శ్రీయ కథానాయిక. పూరీ జగన్నాథ్ దర్శకుడు. ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం గురువారం ఖమ్మంలో ఘనంగా జరిగింది. దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా పైసా వసూల్ థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. బాలకృష్ణ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా మునుపెన్నడూ కనపడని స్టైల్‌లో డైలాగ్‌లు అదరగొట్టేశారు. ఒకరకంగా చెప్పాలంటే పూరీ మాస్ హీరోలోకి బాలయ్య పరకాయ ప్రవేశం చేసేశారు.

గొడవల్లో గోల్డ్ మెడల్ వచ్చిన వాడిని. మళ్లీ టోర్నమెంట్‌లు పెట్టొద్దు, వన్స్ నా స్క్రూ లూజ్ అయితే.. నేను ఇలాగే ఉంటా, బిహార్ నీళ్లు తాగిన వాళ్లనే తీహార్‌లో పోయించా. తు క్యారే హౌలే!, ఓరే రామకృష్ణ థియేటర్ సందులో పెరిగాను. మనది నేల టికెట్ బ్యాచ్, కసి తీరకపోతే శవాన్ని లేపి మరీ చంపేస్తా అంటూ బాలకృష్ణ పలికిన డైలాగ్‌లు అభిమానులతో ఈలలు వేయిస్తున్నాయి.

భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై వి.ఆనంద్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూరుస్తున్నారు. సెప్టెంబర్ 1న పైసా వసూల్ ప్రేక్షకుల ముందుకు రానుంది.



# పీలా జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు



అనకాపల్లి : అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలకు బారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం స్థానిక నూకాంబిక అమ్మవారి దేవాలయ కళ్యాణ మండపంలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఆయన అభిమానులు పూర్తిచేశారు. ఇప్పటికే పట్టణం, అనకాపల్లి మండలం, కశింకోట మంథలాలలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

దీంతో ఆయా ప్రాంతాలు కలకలలాడుతున్నాయి. అలాగే అనేక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. జిల్లా తెలుగు యువత, సమన్వయ కార్యదర్శి కొణతాల నూకునాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పీలా జన్మదినానికి వచ్చిన వారందరూ తిలకించేందుకు ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థాన చైర్మన్ ధనాల విష్ణుచౌదరి ఆధ్వర్యంలో 1000 మంది పేద మహిళలకు ఆలయ పరిసరాలలో ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే చేతుల మీదగా చీరలు పంపిణీ కార్యక్రమం, నిర్వహిస్తున్నారు.

రక్తధాన శిభిరం, ఉచిత వైద్య శిభిరం, ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. కేక్ కటింగ్ కూడా అభిమానుల సమక్షంలో నిర్వహిస్తున్నారు. వచ్చిన వారికి పెద్దయెత్తున ఫలహారం ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

అలాగే అనకాపల్లి కూరగాయల మార్కెట్‌లో చీరలు, మిఠాయిలు పంపిణీ కార్యక్రమం, కశింకోట, అనకాపల్లి మండలాలలో కూడా పెద్ద యెత్తున సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన అభిమానులు తెలిపారు.

























VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com